క్లుప్తంగా

అభయాంజనేయ ఆలయ నిర్మాణానికి విరాళం



సర్పంచ్ అప్పలనాయుడుకు విరాళం అందిస్తున్న పైడిరాజు

పరవాడ: స్థానిక శ్రీ బాలగణపతి సేవా సంఘం అధ్యక్షుడు తేలు పైడిరాజు పరవాడ సంతబయలులో చేపడుతున్న అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి రూ.1,00,116 లను విరాళంగా ప్రకటించారు. ఈ నగదును సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడుకు మంగళవారం అందించారు. సంఘ సభ్యులు విరాళమిచ్చిన పైడిరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

హెటెరోలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు రేపు

పెందుర్తి: హెటెరో కంపెనీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి స్థానిక బాలాజీ డిగ్రీ కళాశాలలో గురువారం వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రొడక్షన్ విభాగంలో జూనియర్ కెమిస్ట్/జూనియర్ అసిస్టెంట్(బీఎస్సీ కెమిస్ట్రీ/ఇంటర్ ఉత్తీర్ణత), క్యూసీ, క్యూఏ విభాగంలో కెమిస్ట్ పోస్టుకు ఎమ్మెస్సీ కెమిస్ట్రీ/బి ఫార్మసీ ఉత్తీర్ణులు అర్హులని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని వెల్లడించారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

హెడ్ కానిస్టేబుల్ నిజాయితీ



పర్స్ పోగొట్టుకున్న వ్యక్తికి తిరిగి అప్పగిస్తున్న ఎస్ఐ భాస్కరరావు, హెచ్‌సీ స్వామి

పెందుర్తి: రోడ్డుపై కనిపించిన నగదుతో ఉన్న పర్స్‌ను, పోగొట్టుకున్న వ్యక్తికి అప్పగించి పెందుర్తి హెడ్ కానిస్టేబుల్ డి.కె.వి.స్వామి నిజాయితీ చాటుకున్నారు. వివరాలివి.. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ప్రభుత్వాస్పత్రికి వెళ్లే మార్గంలో రోడ్డుపై ఓ పర్స్ పడి ఉండటాన్ని హెచ్‌సీ స్వామి గుర్తించారు. వెంటనే ఆ పర్స్‌లో ఉన్న ఆధారాల బట్టి పెందుర్తికి చెందిన నాగమల్లేశ్వరావుదిగా గుర్తించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు అతని వివరాలు సేకరించి స్టేషన్‌కు పిలిపించి పర్స్‌లో ఉన్న రూ.5,200 నగదుతో పాటు ఇతర కార్డులను ఎస్ఐ భాస్కరరావు చేతుల మీదుగా అప్పగించారు. హెచ్‌సీ నిజాయితీని అంతా ప్రశంసించారు.

గంజాయి విక్రయదారుడి పట్టివేత



గంజాయితోపాటు నిందితుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

పెందుర్తి: అక్రమంగా గంజాయిని సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. పెందుర్తి రాచ్చెరువు ప్రాంతానికి చెందిన పవడ శివకుమార్(22) సులభంగా డబ్బులు సంపాదించాలని ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని తెచ్చుకున్నాడు. పెందుర్తి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఆ గంజాయిని ప్యాకెట్లుగా చేసి కొత్తవలస రైల్వేస్టేషన్ వద్ద అమ్మేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారంతో సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు కాలనీ వద్ద మాటు వేసిన సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్వీ భాస్కరరావు బృందం శివకుమార్‌ను చాకచక్యంగా పట్టుకుంది. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

జయ జయ శుభకర వినాయకా..

తలచితినే గణనాథుని.. తలచితినే విఘ్నపతిని తలచిన పనిగా.. తలచితినే హేరంబుని.. తలచితి నా విఘ్నముల దొలగుట కొరకున్.. అంటూ తొలివేలుపు వినాయకుడి పూజకు నియోజకవర్గ ప్రజలు సిద్ధమయ్యారు. ఊరూ వాడా, వీధివీధినా మండపాలు ఏర్పాటు చేసి, ప్రతి వీధి, ప్రతి ఇంటినీ ఓ మందిరంగా మార్చేశారు. రెండు రోజులుగా ఎడతెగని వాన కురుస్తున్నా.. స్వామిపై నమ్మకంతో ఏర్పాట్లలో మునిగితేలారు. మంగళవారం సాయంత్రానికి వరుణుడు కాస్త తెరిపివ్వడంతో మార్కెట్లు, రైతు బజార్లు, పూజాసామగ్రి విక్రయాలు జరిపే కూడళ్లు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి.

- ఉదయం నుంచి వర్షంతో వ్యాపారులు ఇబ్బందులు
- సాయంత్రం కాస్త తెరిపివ్వడంతో ఊపిరిపీల్చుకున్న వైనం
- పూలు, పత్రి, ఫలాలు కొనుగోళ్లలో ప్రజలు



జోరు వానలో పెందుర్తి కూడలి వద్ద పూజాసామగ్రి అమ్మకాలు



పెందుర్తి రైతుబజార్ వద్ద గణేష్ పూజకు పండ్లు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



అడవివరం మార్కెట్‌లో పత్రి, ఫలాలు కొనుగోలు చేస్తున్న గ్రామస్తులు

పెందుర్తి: వినాయక చవితి సందర్భంగా మంగళవారం సాయంత్రం పెందుర్తి పట్టణంలో సందడి నెలకొంది. ఉదయం నుంచీ జోరువాన కురవడంతో ప్రజలు బయటకు రావడానికి ఇబ్బందులు పడ్డారు. అయితే సాయంత్రం వర్షం కాస్త తెరిపినివ్వడంతో వేపగుంట, సుజాతనగర్, పురుషోత్తపురం, పెందుర్తి రైతు బజార్, పెందుర్తి కూడళ్లు ఒక్కసారిగా రద్దీగా మారాయి. గణపతి విగ్రహాల కొనుగోళ్లతో పాటు పూజాసామగ్రి విక్రయాలు జోరుగా సాగాయి.

మొదలైన చవితి సందడి

సింహాచలం: వినాయక చవితి పూజా సామగ్రి కొనుగోలుచేసే గ్రామస్తులు, మహిళలతో మంగళవారం అడవివరంలోని మార్కెట్ కిటకిలాడింది. ఎటుచూసినా వినాయక ప్రతిమలు, పాలవెల్లిలు, పూజాసామగ్రి, ఫలాలు, పుష్పాలతో మార్కెట్ అంతా కళకళలాడింది. బుధవారం వినాయక చవితిని ఘనంగా జరిపేందుకు గ్రామస్తులు, మహిళలు వినాయక విగ్రహాలు, పత్రి, పూజా సామగ్రి, ఇతర సరంజామా కొనుగోలు చేశారు. మట్టి వినాయక ప్రతిమలనే ఎక్కువగా వ్యాపారులు విక్రయించారు. సైక్లోన్ ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి వర్షం కురవడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెచ్చిన సరకుల విక్రయాలు జరుగుతాయో.. లేదోనని భయపడ్డారు. సాయంత్రం నుంచి వర్షం తెరిపివ్వడంతో కొంతమేర ఊపిరి పీల్చుకున్నారు.

- జీవీఎంసీ 93, 98వ వార్డుల్లో వాడవాడలా వినాయక చవితి సందడి మంగళవారం నుంచే మొదలైంది. 93వ వార్డు పరిధి బాలాజీనగర్, శ్రీనివాసనగర్, ప్రహ్లాదపురం, గొల్లనారాయణపురం తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వేదికలను ఏర్పాటు చేశారు. 98వ వార్డు పరిధిలోని అడవివరం, సింహపురికాలనీ, అప్పన్నపాలెం, బాలాజీనగర్, శ్రీనివాసనగర్, పాత అడవివరం, సింహాచలం కొండ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వేదికలు ఏర్పాటుచేసి, అందంగా ముస్తాబు చేస్తున్నారు. పలుచోట్ల మంగళవారం సాయంత్రానికే వినాయక విగ్రహాలను వేదికల వద్దకు చేర్చారు. బుధవారం కలశప్రతిష్ఠ చేసి విగ్రహాలను పందిళ్లలో ఏర్పాటు చేయనున్నారు.

గణపతి మండపాలకు 360 దరఖాస్తులు

పెందుర్తి: వినాయక చవితి సందర్భంగా పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో 360 మండపాలకు అనుమతి కోసం దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా వచ్చినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా దరఖాస్తులను పరిశీలించి మంగళవారం ఎన్‌వోసీలు జారీ చేశామన్నారు. ఆయా పత్రాలను నేరుగా మండపాల వద్దకు వెళ్లి తమ పోలీసులే అందించారని పేర్కొన్నారు.



ఎన్‌వోసీ పత్రాలు అందిస్తున్న ఎస్ఐ దేముడుబాబు, సిబ్బంది

రేపు ‘ఆదర్శ్’లో మెగా జాబ్‌మేళా

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాల, దివీస్ లేబొరేటరీ సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా గురువారం నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఎన్ఈ ఫ్లోరా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దివీస్ కంపెనీలో టెక్నీ సూపర్‌వైజర్, గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ, డిప్లొమా, బీఫార్మసీ, బీటెక్, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ/అనలటిల్ కెమిస్ట్రీల్లో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని దివీస్ సంస్థల్లో ఉద్యోగాలు చేయాలని తెలిపారు. గురువారం ఉదయం 9 నుంచి అన్ని ధ్రువపత్రాలతో ఆసక్తి, అర్హులైన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

ఘనంగా మదర్ థెరిసా జయంతి



మదర్ థెరిసా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్ఎం శ్రీనివాసరావు, విద్యార్థులు

పెందుర్తి: పురుషోత్తపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మదర్ థెరిసా 115వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు చిరికి శ్రీనివాసరావు థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. దేశానికి ఆమె అందించిన సేవలను కొనియాడారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మృణ్మయ గణపతినే పూజిద్దాం



వేపగుంటలో మట్టి విగ్రహాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత యతిరాజుల నాగేశ్వరరావు



అడవివరంలో వినాయక ప్రతిమలు అందిస్తున్న కర్రి అప్పలస్వామి



పెందుర్తిలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

పెందుర్తి: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ వినాయక చవితి రోజు మట్టి గణపతి విగ్రహాలను మాత్రమే పూజించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధికార ప్రతినిధి యతిరాజుల నాగేశ్వరరావు అన్నారు. వేపగుంటలోని అప్పలనర్సయ్యకాలనీలో మంగళవారం ఆయన మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

- సుజాతనగర్లోని షిరిడిసాయి ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ప్రజల కోసం గణపతి మట్టి విగ్రహాలను అందుబాటులో ఉంచారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఈ విగ్రహాలను పంపిణీ చేశారు.
- పెందుర్తిలోని శ్రీసాయిదత్త మానస పీఠం ఆధ్వర్యంలో 1500 గణపతి మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని మేయర్ పీలా శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభించారు. పీఠాధిపతి స్వామి సాయి దత్త లోకేష్ నంద మహాస్వామి, స్థానిక నాయకుడు పీలా జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.
- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో పెందుర్తిలో మట్టి విగ్రహాలు అందించారు. నల్లక్వారీ, ప్రశాంతినగర్, ఎల్ఐసీ కాలనీ, వెలంపేట ప్రాంతాల్లో దాదాపు 500 విగ్రహాలు పంపిణీ చేశారు.

సింహాచలం: అడవివరంలోని కర్రి అప్పలస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం వినాయక ప్రతిమలు, పాలవెల్లిలు, వినాయక వ్రతకథ పుస్తకం ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ వద్ద ట్రస్ట్ చైర్మన్, 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి అప్పలస్వామి 500 మంది భక్తులకు వీటిని అందించారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతిలనే పూజించి, పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడవివరం కోఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, స్థానికులు ఎస్.అప్పారావు, కొలుసు రామారావు, కంపర గణేష్, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా విశాఖ ఫార్మాసిటీ రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం చేపట్టారు. ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌భక్షి, ఉద్యోగులు, కార్మికులు కలిసి వివిధ గ్రామాల ప్రజలకు ఉచితంగా మట్టి గణేష్ విగ్రహాలను అందించారు. అనంతరం గిరిధర్‌భక్షి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను చెరువులు, నీటి గుంటలు, సముద్రంలో కలపడం వలన నీటి కాలుష్యంతో మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించి, నిమజ్జనం చేయడం ద్వారా పర్యావరణంపై ఎలాంటి చెడు ప్రభావం ఉండదన్నారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్, ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఉమెన్ కోఆర్డినేటర్ రాజేశ్వరి, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

- జేఎన్ ఫార్మాసిటీలో సీయాంక ఫార్మా పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జెట్టి సుబ్బారావు మట్టి వినాయక విగ్రహాలను మంగళవారం అందించారు.



మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సీయాంక పరిశ్రమ ఎండీ జెట్టి సుబ్బారావు



మట్టి వినాయక ప్రతిమలను అందిస్తున్న ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌భక్షి



పెందుర్తిలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నేత గొర్లె రామునాయుడు

వదలని వాన.. స్తంభించిన జనజీవనం



వర్షంతో వినియోగదారులు లేక వెలవెలబోతున్న వారపు సంత



పెందుర్తిలో వర్షపు నీటితో మునిగిన వరి పొలాలు

పరవాడ: మండలంలో గత రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షంతో ఎక్కడికక్కడ జనజీవనం స్తంభించింది. ఆగకుండా పడుతున్న వర్షంతో పరవాడలోని వారపు సంత వినియోగదారుల్లేక వెలవెలబోయింది. వ్యాపారులు సంతలో విక్రయించడానికి తీసుకువచ్చిన సరకుల్ని తడిచిపోకుండా టార్పాలిన్లతో కాపాడుకునేందుకు తిప్పలు పడాల్సి వచ్చింది. సాయంత్రం వరకూ ఇదే పరిస్థితి ఉండటంతో వ్యాపారాలు సాగక, ఉసూరుమంటూ వెనుదిరిగారు. వర్షం కారణంగా పశువులు రాకపోవడంతో పశువుల సంత బోసిపోయింది. ముసురుతో ప్రజలు ఇళ్లుదాటి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. వర్షంతో ప్రజలు తమ ప్రయాణాలను రద్దు చేసుకోవడంతో బస్సులు ఖాళీగా తిరిగాయి. ఆటోలు కూడా స్టాండ్‌లకే పరిమితమయ్యాయి. తాజా వర్షానికి మండలంలోని పలు చెరువుల్లో నీరు చేరింది. ఇటీవల వ్యవసాయ బోర్ల సాయంతో వేసిన వరి నాట్లకు ప్రస్తుత వర్షం కొంత ఊపిరిపోసింది. దీంతో వరినాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇటీవల నాటిన సరుగుడు, యూకలిప్టస్ మొక్కలకు ఈ వర్షం చాలా ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దంచికొట్టిన వాన

పెందుర్తి : వరుణుడు జోరు పెంచాడు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో నియోజకవర్గాన్ని సోమవారం రాత్రి నుంచి వాన ముంచెత్తింది. మంగళవారం రోజంతా ఎడతెరిపిలేని వర్షంతో పెందుర్తి పట్టణం, గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పొలాల్లో నీరు ఏరులై పారింది. దాదాపు అన్ని చెరువులూ నిండుకుండలను తలపించాయి. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ ప్రధాన కాలువ ఉధృతంగా ప్రవహించింది. పెందుర్తి ప్రాంతంలో మంగళవారం రాత్రికి 100.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

పకడ్బందీగా సామాజిక తనిఖీల గ్రామసభలు



మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యతివ్వాలని, గ్రామ సభలు సక్రమంగా నిర్వహించాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులకు సామాజిక తనిఖీలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో చేపట్టే ఉపాధి హామీ పథకం పనులు అందరికీ ఉపయోగపడాలన్నారు. ఎంపీడీవో శివప్రసాద్ నారాయణతో పాటు ఎస్ఎస్ఏటీ డైరెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ హౌసింగ్, అటవీశాఖ, సర్వ శిక్ష అభియాన్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ తదితర అన్ని విభాగాల పనులకు సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సుమారు రూ.14.72 కోట్లతో పలు పథకాల్లో భాగంగా చేపట్టిన పనులపై ఈ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో చేపట్టిన అన్ని పనులపై 3–4 రోజులు తనిఖీ చేసి, పూర్తయ్యాక గ్రామ సభ నిర్వహిస్తామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు పూర్తయిన తర్వాత మండల కేంద్రంలో మండల ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చైతన్య, ఎస్టీఎం గౌరీ శంకర్, ఎస్ఆర్‌పీ చిరంజీవితో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఎస్ఆర్ఈజీఎస్ ఏపీవోలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి ఆశ్రయం

స్వయంగా సపర్యలు చేసిన సీఐ సతీష్‌కుమార్



మతిస్థిమితం లేని వ్యక్తిని ఆటోలో లయోలా ఆశ్రమానికి తరలిస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: పెందుర్తి పోలీసులు మరోసారి మానవత్వం చాటుకున్నారు. మతిస్థిమితం కోల్పోయి నిరాశ్రయుడిగా తిరుగుతున్న ఓ వ్యక్తికి ఆశ్రయం కల్పించారు. వివరాలివి.. పినగాడి కూడలి సమీపంలో ఓ వ్యక్తి(30) మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఆహారం కోసం స్థానికులను అర్థిస్తున్నాడు. దీనిపై పోలీసులకు ‘సాక్షి’సమాచారం అందించింది. వెంటనే స్పందించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ మంగళవారం రాత్రి పినగాడి కూడలికి వెళ్లి, ఆ వ్యక్తిని గుర్తించి, ఆహారం అందించారు. అనంతరం స్థానిక లయోలా వృద్ధాశ్రమానికి తరలించి, ఆశ్రయం కల్పించారు. సదరు వ్యక్తి కుటుంబం వివరాలు సేకరించనున్నట్లు సీఐ వెల్లడించారు. ఇలాంటి వ్యక్తులు ఎక్కడ ఉన్నా పోలీసులకు సమాచారం ఇస్తే వారికి తగిన ఆశ్రయం కల్పిస్తామన్నారు. పోలీసుల స్పందనపై స్థానికంగా ప్రశంసలు వెల్లువెత్తాయి.

కీచక అధ్యాపకుడిపై చర్యలకు డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు కృష్ణంనాయుడు



సీఐ మల్లికార్జునరావుకు వినతిపత్రం అందిస్తున్న ఐద్వా ప్రతినిధులు

పరవాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన అధ్యాపకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కూండ్రపు కృష్ణంనాయుడు డిమాండ్ చేశారు. పరవాడలో మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. కూతురు వయసున్న విద్యార్థిని పట్ల లెక్చరర్ అసభ్యంగా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సంఘ మహిళాధ్యక్షురాలు కూండ్రపు ఉమామహేశ్వరి, అధ్యక్షుడు మాసవరపు అప్పారావు, కన్వీనర్ మాసవరపు వెంకినాయుడు పాల్గొన్నారు.

- కళాశాల విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన లెక్చరర్ శ్రీధర్‌పై సమగ్ర విచారణ జరిపి కఠిన శిక్ష పడేలా చూడాలని ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐ మల్లికార్జునరావును కలిసి వినతిపత్రం అందించారు. కళాశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టి, విద్యార్థులకు రక్షణ కల్పించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఐద్వా సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులు బంగారమ్మ, అన్నపూర్ణ, హసీనాబేగం ఉన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న దాడి రమణచిట్టి

పెందుర్తి: ఇటీవల జరిగిన 10వ ఆంధ్రప్రదేశ్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో స్థానిక ఎల్ షాధీ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచారు. సునీల్‌కుమార్ స్వర్ణం, జయశ్రీ, భార్గవ్ రజతాలు, ప్రియ, వర్షిత్, బాల కార్తికేయ, షణ్ముఖ్, హనీస్, హరితేజ కాంస్య పతకాలు సాధించారు. మంగళవారం పెందుర్తిలో జరిగిన కార్యక్రమంలో వ్యాపారవేత్త దాడి రమణచిట్టి, చైర్మన్ దాడి శ్రీనివాస్, ప్రతినిధులు అంజూరి కరుణాకర్, ఎస్.అనురాధ, అర్జున్ పడాల పాల్గొని విజేతల్ని అభినందించారు.

విద్యార్థుల సృజనాత్మకత



వినాయక మాస్కులు ధరించిన విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని గొటివాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు స్వయంగా గణేష్ మాస్కులను తయారుచేసి తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వినాయక చిత్రాలతో కూడిన మాస్కులను ఆవిష్కరించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమాన్ని హెచ్ఎం పీవీ ఆనంద్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి, పండగల ప్రాముఖ్యతను తెలిపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు.